క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమాల్లో ఆదివారం మంత్రి ఆర్కే రోజా పాల్గొననున్నారు. ఉదయం పుత్తూరులో నిర్మించనున్న వన్నెరెడ్డి సంఘం నూతన భవనానికి భూమి పూజ చేయనున్నారు. అనంతరం విజయపురం మండలం మల్లారెడ్డి కండ్రిగ ఆది ఆంధ్ర వాడలో రూ.4 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించనున్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

శ్రీరంగరాజపురం: మండలంలోని పెద్దతయ్యూరు గ్రామంలో రామభక్తులు అయోధ్య అక్షింతలను శనివారం ప్రజలకు పంపిణీ చేశారు. గ్రామంలోని హిందూ కుటుంబాల ఇళ్లకు వెళ్లి అక్షింతలు అందజేశారు. సర్పంచ్ వరదమ్మ, పూజారి గుండుమణి, వెంకటేష్, చెంగల్రాయులు, రవి పాల్గొన్నారు.

చెత్త సంపదపై శ్రద్ధ పెట్టాలి


ఎరువును పరిశీలిస్తున్న రమేష్

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పాలసముద్రం, ఆముదాల, బాలక్రిష్టాపురం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి, వానపాములు వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల మేరకు విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న


బంగారు తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐకి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కొత్తగా ప్రారంభిస్తున్న ఎలక్ట్రీషియన్(డొమస్టిక్ సొల్యూషన్స్), ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్స్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసిన 18 నుంచి 42 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఐటీఐ డ్రాపౌట్స్ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్స్‌లు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ నగేష్ తెలిపారు.

కాణిపాకంలో ఆరోరోజు స్వచ్ఛ తీర్థ సేవ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాలు స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమం ద్వారా శుభ్రం అవుతున్నాయి. వరుసగా ఆరవ రోజు శనివారం ఆలయ అధికారులు, సిబ్బంది చైర్మన్ డార్మిటరీ, మరగదాంబికా దేవి కల్యాణ మండపం, బస్టాండు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమల గిరిబాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధివైపు మరో అడుగు

- నగరి సహకార సంఘంలో జనరిక్ మెడికల్ షాపు
- ఆదర్శంగా నిలుస్తున్న సంఘం



పీఏసీఎస్‌లో సిద్ధమైన జనరిక్ మెడికల్ దుకాణం, నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

నగరి: ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి పథంలో ఒక్కో మైలురాయిని దాటుకుంటూ ముందుకు వెళుతోంది. ఇప్పటికే అన్ని రకాల వ్యాపారాల్లోను, రికవరీల్లోనూ, ఆదాయ మార్గాలు వెతుక్కోవడంలోనూ జిల్లాలోనూ అగ్రగామిగా సంఘం పేరుపొందింది. ఎరువులు, బియ్యం విక్రయాల్లోను తన సత్తా చాటుకున్న సహకార సంఘం గత ఏడాది పెట్రోల్ బంక్ నిర్వహణను ప్రారంభించి విజయవంతంగా నడుపుతోంది. వరుసగా రెండుసార్లు ఎక్సలెన్స్ మెరిట్ అవార్డు సాధించింది. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన «సహకార్‌సే సమృద్ధి» కార్యక్రమంలోనూ నగరి సహకార సంఘం సింబాలిక్ సర్టిఫికెట్ స్టోర్ కోడ్‌ను కైవసం చేసుకుంది. ఇలా అభివృద్ధి పథంలో వెళుతున్న సహకార సంఘం కేంద్ర ప్రభుత్వం అమల్లోకితెచ్చిన జన్ ఔషధ్ కేంద్రం (జనరిక్ మెడికల్ షాపు)ను ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించనుంది. జిల్లా వ్యాప్తంగా ఐదు జనరిక్ మెడికల్ షాపులు మంజూరుకాగా నగరి సహకార సంఘంలో ప్రథమంగా ప్రారంభం కానుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా జనరిక్ మెడికల్ షాపును ప్రారంభించనున్నారు.

ఇక చౌక ధరకే ప్రజలకు మందులు

మందులు తయారుచేసిన కంపెనీకి సంబంధిత పేటెంట్ హక్కుల కాలం ముగిసిన తరువాత అదే ఫార్ములాతో ఇతర కంపెనీలు తయారుచేసే జనరిక్ మందులు 50 శాతం నుంచి 80 శాతం వరకు తక్కువ ధరకు సహకార కేంద్రంలోని జనరిక్ మెడికల్ షాపులలో లభ్యమవుతాయి. మందుల కొనుగోలుకు ప్రజలు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉండదు. దీంతో ప్రజలకు చౌక ధరకే మందులు అందుబాటులోకి వస్తాయి.

అభివృద్ధి పథం

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.42 లక్షల వ్యయంతో సహకార సంఘానికి నూతన భవనం నిర్మించారు. రూ.29 లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. రూ.67 లక్షల వ్యయంతో ఫార్మర్ ఫంక్షన్ హాలు నిర్మిస్తున్నారు. రూ.30 లక్షల వ్యయంతో సంఘం స్థలాన్ని చదును చేసి, ప్రహరీ గోడ నిర్మించి అందులో పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నారు.

సంఘాలు ఆర్థికంగా బలోపేతం



వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రుణాలు ఇవ్వడంతో పాటు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే సంఘాల ద్వారా ఇప్పటికే పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపు ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాలో నగరి పీఏసీఎస్ ప్రథమ స్థానంలో ఉంది. వరుసగా రెండు సార్లు ఎక్సలెన్స్, మెరిట్ అవార్డులు సాధిస్తూ వస్తోంది. సింబాలిక్ సర్టిఫికెట్ స్టోర్ కోడ్‌ను కైవసం చేసుకుంది.

–తులసిపిళ్లై, సీఈవో, నగరి పీఏసీఎస్

ప్రభుత్వ సహకారంతోనే



ప్రభుత్వ సహకారంతో పాటు అభివృద్ధి పనుల్లో మంత్రి రోజా ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. కనుకే పీఏసీఎస్ అభివృద్ధి వేగంగా సాగుతోంది. జిల్లాలో నగరి పీఏసీఎస్ మొదటి స్థానంలో నిలిచి నేడు సొంత భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్, రైతు ఫంక్షన్ హాలు, జనరిక్ మందుల విక్రయాలు అంటూ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయంటే, అది మంత్రి సహకారంతోనే సాధ్యమైంది. ఏ సాయం కావాలన్నా అత్యంత వేగంగా సమకూరుస్తున్నారు. డీసీసీబీ, నాబార్డు, ఆప్కాబ్, పీఏసీఎస్ డెవలప్‌మెంట్ సెల్ అధికారులు ప్రోత్సాహం అందిస్తున్నారు.

–తిరుమలరెడ్డి, చైర్మన్, పీఏసీఎస్, నగరి

తిరుచ్చిపై శ్రీవారి దివ్యతేజం


తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.

సదాశివకోనకు రూ.1.73 లక్షల ఆదాయం

పుత్తూరు: వడమాలపేట మండల పరిధిలోని సదాశివ కోనకు సంబంధించి తలనీలాల వేలం పాట ద్వారా రూ.1.73 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్ర తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే మార్చి 8వ తేదీన మహాశివరాత్రి, చిత్రా పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం


పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. శనివారం వెదురుకుప్పం వెలుగు కార్యాలయం వద్ద పెరటి కోళ్ల పంపిణీ జరిగింది. మండలంలోని 40 మంది మహిళా సభ్యులకు అందజేశారు. జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆదాయా న్ని రెట్టింపు చేయాలన్న సంకల్పంతో పెరటి కోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, సర్పంచ్ శిల్ప, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, ఏపీఎం కవిత, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛతా సేవ


ఆలయంలో పరిశుభ్రత పనులు చేస్తున్న సంఘ్ పరివార్ సభ్యులు

పుత్తూరు: అయోధ్యలో బాలరాముని ప్రతిష్టను పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని ఆలయాల్లో స్థానిక సంఘ్ పరివార్ సభ్యులు స్వచ్ఛతా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరాలయం, భక్త ఆంజనేయస్వామి ఆలయాల్లో పరిశుభ్రత పనులు చేపట్టారు. పరివార్ నాయకుడు కె.బాబు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ సోమవారం అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నూతనంగా నిర్మించిన మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట ఉంటుందని తెలిపారు. ఇప్పటికే శ్రీరామ రక్షిత అక్షింతలు ప్రతి ఇంటికీ అందజేసినట్లు తెలిపారు. సోమవారం దగ్గరలోని దేవాలయాల్లో రామభక్తులతో కలిసి భజనలు, రామకీర్తనలు నిర్వహించాలని కోరారు. సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత ఇంటి ముందు దీపాలు వెలిగించి దీపోత్సవ పండుగను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ పరివార్ సభ్యులు హరిబాబు, సుబ్రమణ్యం, వెంకటేష్, ఉమాపతి, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల స్థల పరిశీలన


భవన నిర్మాణాలకు ప్లానింగ్ ఇస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని పచికాపల్లం సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాల స్థలాన్ని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. డిగ్రీ కళాశాలకు సంబంధించి పక్కా భవనాల నిర్మాణం కోసం రూ.17 కోట్ల 82 లక్షల 50 వేల నిధులను ఇటీవల మంజూరయ్యాయి. కాగా ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించిన ఇంజినీరింగ్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. పక్కా భవనాల నిర్మాణాలకు సంబంధించి మార్కింగ్‌లు ఇచ్చారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రధాన రహదారికి పోనూ మిగిలిన స్థలంలో భవనాలు నిర్మించేందుకు అవసరమైన స్కెచ్ ఇచ్చారు. ఎస్ఈ, డిప్యూటీ ఈఈ, కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు, కో–ఆర్డినేటర్ వెంకటేశ్, సీనియర్ అసిస్టెంట్ సురేంద్ర పాల్గొన్నారు.

మౌలిక వసతులు ఉండేలా చూడాలి


సమీక్షలో ఎంపీడీఓ మోహన్‌మురళి

కార్వేటినగరం: అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాలైన మౌలిక వతులు ఉండేలా చూడాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ మోహన్‌మురళీ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరల్ అధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌సౌకర్యం, ర్యాంపు సౌకర్యం కలిగి ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు మౌలిక వసతులు ఏర్పాటుపై పూర్తి బాధ్యత ఎంఈఓలపై ఉందన్నారు. ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ దినేష్ పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నేతలు

పెనుమూరు(కార్వేటినగరం): వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ తండ్రి సుబ్రమణ్యం(70) తేనెటీగల దాడిలో మృతిచెందినట్లు సమాచారం అందుకున్న వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లాకుప్పం శేఖర్, శనివారం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డీపీఎస్ మణి, మండల అధ్యక్షుడు పురుషోత్తం, వడ్డెర సంఘం నాయకులతో కలిసి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నీల, దాము, హరికృష్ణ వడ్డెగుడెసెలు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వరదయ్యపాళెంలో జోరుగా వరి కోతలు


పెద్ద పాండూరు ప్రాంతంలో యంత్రంతో వరికోతలు

వరదయ్యపాళెం: మండలంలోని వివిధ ప్రాంతాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని చిలమత్తూరు, సీఎల్ఎస్‌పల్లి, రాచర్ల, కోవూరుపాడు, అంబూరు, వరదయ్యపాళెం, తొండంబట్టు, చిన్న పాండూరు, పెద్ద పాండూరు ప్రాంతా ల్లో ఖరీఫ్ చివర, రబీ ప్రారంభంలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో కోతలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌లో 3500 హెక్టార్లలో వరి పంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


క్రికెట్ విజేత జట్టు క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు


క్రీడా కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గంగాధర నెల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం హోరాహోరీగా జరిగాయి. క్రికెట్ పోటీల్లో జీడీ నెల్లూరు గ్రామ సచివాలయానికి చెందిన క్రీడాకారులు మండల స్థాయిలో గెలుపొంది నియోజకవర్గ స్థాయిపోటీలకు అర్హత సాధించారు. అనంతరం ఎంపీపీ అనిత చేతులమీదుగా మండల స్థాయిలో వివిధపోటీల్లో గెలు పొందిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయి పోటీల కోసం ప్రభుత్వం అందజేస్తున్న ఆడుదాం ఆంధ్ర కిట్లను అందజేశారు. సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, ఇంచార్జ్ ఎంపీ డీఓ సుధాకర్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ముక్కలత్తూరు ఎంపీటీసీ మగిమైదాస్, సీనియర్ వ్యా యామ ఉపాధ్యాయులు సెల్వ పాండియన్, సచివాలయ ఉద్యోగులు, వలంటరీలు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడలు


ఆర్గనైజర్లు, పీఈటీలకు సన్మానం చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

పాలసముద్రం: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయని ఎంపీడీఓ రామనాథరెడ్డి, తహసీల్దార్ బాబు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామస్థాయి క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు తీసుకొచ్చిందని తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలిచిన వారికి ఎంపీపీ ఎస్ శ్యామల సొంత ఖర్చుతో ఇచ్చిన మెమెంటోలను ఎంపీడీఓ, తహసీల్దార్ పంపిణీ చేశారు. మండల స్థాయి క్రీడలను విజయవంతం చేసినందుకు పీఈటీ, టీచర్లకు ఎంపీడీఓ, తహసీల్దార్ సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారిణులు

ఘనంగా సర్వమంగళాదేవి జాతర


సత్యవేడు: ట్రాక్టరుపై ఊరేగింపుగా వెళుతున్న సర్వమంగళాదేవి


వీధుల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

సత్యవేడు: గిరిజన కాలనీ గ్రామ దేవత సర్వమంగళాదేవి సంక్రాంతి జాతర మహోత్సవం శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యంతోపాటు గాజులు, చీరలు సమర్పించారు.

మట్టి విగ్రహానికే అలంకరణ, మొక్కులు

ఉత్సవాల్లో పంచ లోహాలతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాలకు అలంకరణ చేసి ఊరేగించడం ఆనవాయితీ. ఈ ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ప్రతిమను తయారుచేసి పూలు, వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్ల ముందు పెద్ద ఎత్తున ముగ్గులు వేశారు. విశేషపూలాంకరణతో అలకంరించిన అమ్మవారిని గొబ్బెమ్మ పాటలు పాడుతూ ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. సర్వమంగళాదేవికి గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి నృత్యాలు చేశారు. ట్రాక్టరుపై అమ్మవారిని ఊరేగించారు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఊరేగింపు శనివారం ఉదయం 8 గంటల వరకు సాగింది. మహిళలు అమ్మవారి ఊరేగింపు వెంట గొబ్బెమ్మ పాటలు పాడుతూ సద్ది అన్నం, పెరుగు అన్నం తీసుకొని వెళ్లారు. సత్యవేడు బీసీ కాలనీ, గిరిజన కాలనీ, ఆర్టీసీ రోడ్డు, శ్రీకాళహస్తి బస్టాండు రోడ్డు, నేతాజీ రోడ్డు నుంచి జంట కోనేరు సమీపంలోని చెరువు వరకు ఊరేగింపు సాగింది. మహిళలు తెచ్చిన సద్ది అన్నం, పెరుగు అన్నం అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని జలధిలో నిమజ్జనం చేశారు.